ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు

మాయా మిర్చిందా?

- మిర్చి ధర భారీగా తగ్గుదల
- ఎగుమతి ఆర్డర్లు లేవంటున్న వ్యాపారులు
- దిగుబడి తగ్గినా పెరగని ధరలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి మార్కెట్‌లో ఈ ఏడాది విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గడం సహజం. ఉత్పత్తి గణనీయంగా తగ్గినా ధరలు తగ్గడంతో రైతులు అయోమయంలో చిక్కుకున్నారు. గుంటూరు మిర్చి ధరలు కొన్ని రోజుల నుండి క్రమంగా తగ్గుతుండగా గురువారం ఈ ధరలు మరింత తగ్గాయి. ధరలు పడిపోవడంతో రైతులకు నిరాశ ఎదురైంది. ఎగుమతులు లేకపోవడం, ప్రస్తుతం యార్డుకు వస్తున్న సరుకు చివరి కోతలకు సంబంధించిందని, నాణ్యత తక్కువగా ఉందని వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

గతేడాది ఇదే సమయంలో సగటు ధర క్వింటాళ్‌కు రూ.25 వేల నుంచి రూ.26 వేల వరకు ఉండగా ఈ ఏడాది రూ.20 వేలకు మించి ధర రావడం లేదని రైతులు వాపోయారు. అయితే గతేడాది 5.29 లక్షల క్వింటాళ్ల సరుకు యార్డుకు రాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 2.63 లక్షల క్వింటాళ్లు మాత్రమే సరుకు వచ్చింది. ఉత్పత్తి దాదాపు 50 శాతం తగ్గింది. కానీ ధర పెరగకపోగా తగ్గింది. డిమాండ్, సప్లయ్ సూత్రంలో తక్కువ సరుకు వచ్చినప్పుడు ఎక్కువ ధర రావాల్సి ఉండగా అందుకు భిన్నంగా ఈ ఏడాది ధరలు పతనమయ్యాయి. కేవలం ఎగుమతులకు ఆర్డర్లు లేవనే సాకుతో ధరలు తగ్గించారని రైతులు విమర్శిస్తున్నారు.

2021-22లో కనిష్ట ధర రూ.7వేలు, గరిష్టధర రూ.15 వేలు పలికింది. 2022-23లో కనిష్ట ధర రూ.7 వేలు, గరిష్ట ధర రూ.23 వేలు, 2023-24లో కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్టధర రూ.26,500 పలకగా ఈ ఏడాది కనిష్టం రూ.7,500, సగటు గరిష్ట ధర రూ.20 వేలకు తగ్గింది. గతేడాది మేలో క్వింటాళ్ మిర్చి కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.26,500 పలికాయి. బాడిగ మంచి రకానికి గతంలో రూ.35 వేల వరకు ధర పలకగా గురువారం సగటు ధర రూ.16,500 మాత్రమే వచ్చింది. మిగిలిన అన్నిరకాల మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ధరలు తగ్గడంతో రైతులు, వ్యాపారులు ఎక్కువగా కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి నిల్వలు చేస్తున్నారు. రైతులు కూడా ఎక్కువ చేసుకోలేక అయినకాడికి అమ్ముకునేందుకు సిద్ధపడటం వల్ల ధరలు తగ్గుతున్నాయని వ్యాపారులు తెలిపారు.

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 75 లక్షల ▶ 2లో

నిరసన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

నీట్ పరీక్ష నిర్వహణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో గురువారం స్థానిక చంద్రమౌళి నగర్ నుండి లక్ష్మీపురం మధర్‌థెరిస్సా విగ్రహం వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని వెంటనే రద్దు చేసి, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నీట్ ఫలితాలు భారతదేశంలోని విద్యార్థులందరిని ఆశ్చర్యానికి గురి చేశాయని అన్నారు. 68 మంది విద్యార్థులు మొదటి ర్యాంకు పొందటం, గ్రేస్ మార్కులు ఇంప్లిమెంటేషన్ చేయటం, జూన్ 14న విడుదల చేయాల్సిన నీట్ ఫలితాలను జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున విడుదల చేయటం వంటివన్నీ నీట్ పరీక్ష సరిగ్గా నిర్వహించలేదనే సందేహాలకు అద్దం పడుతున్నాయని చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశంలో వైద్య విద్య ప్రవేశాల కోసం జరుగుతున్న ఇటువంటి పరీక్షలలో పేపర్ లీకేజ్ అయిందని ఆరోపణలు, దానికి అనుగుణంగా ఇటువంటి పరిణామాలు ఎంబిబిఎస్ చదవాలనే విద్యార్థులను వారి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అన్నారు. నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని విమర్శించారు. ▶ 2లో

వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డిసిహెచ్‌ఎస్ రంగారావు

తల్లీబిడ్డ మృతి కారకులపై కఠిన చర్యలు

- ఉమ్మనీరు తాగి బిడ్డ, రక్తస్రావంతో తల్లీ మృతి
- డిసిహెచ్‌ఎస్ రంగారావు - ఘటనపై విచారణ
- మృతురాలి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తామని ప్రకటన

2 లో

రాజధాని నిర్మాణాలను పరిశీలించిన సిఎం

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాజధాని గ్రామాల్లో పర్యటించారు. సిఎం ముందుగా ఉండవల్లిలో గత ప్రభుత్వం కూల్చివేసిన ప్రజావేదికను సందర్శించారు. అనంతరం ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన ప్రాంతానికి వెళ్లి టిడిపి హయాంలో నిర్మించిన భవన సముదాయాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో)

కార్పొరేషన్‌లో అవినీతిపై ఆడిట్ విచారణ

- నిధుల దారిమళ్లింపుపై ప్రభుత్వం సీరియస్
- కమిషనర్ లేఖకు స్పందించిన ఉన్నతాధికారులు

7 లో

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

రెండు కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఏడుగురి ముఠాని టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ ఎం.రమేష్ గురువారం వెల్లడించారు. ముగ్గురు వ్యక్తులు ఒడిశా ప్రాంతంలో గంజాయిని చౌకగా కొనుగోలు చేసి దాన్ని తెనాలి ప్రాంతానికి తెచ్చి ఇక్కడ మరి కొంతమందితో కలిసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడతో పోలీసులు దాడి చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వియస్సార్ అండ్ ఎన్‌విఆర్ కళాశాల సమీపంలో ఎన్‌విఆర్ నగర్ ముఖద్వారం వద్ద ఉన్న గంజాయి ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ▶ 2లో

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్ తదితరులు

నేడు కేంద్ర మంత్రి పెమ్మసాని రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలి సారిగా గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం జిల్లాకు రానున్నారు. ఏడు నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో సాయంత్రం 6 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహించనునానరు. మంగళగిరి నుంచి గుంటూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ గుంటూరు ఆటోనగర్, ఆర్టీసీ బస్టాండ్, జిన్నా టవర్ సెంటర్, ఏసీ కళాశాల, హిందూ కళాశాల, శంకర్ విలాస్ ఫ్లైఓవర్, అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్ లో గల శ్రీ కన్వెన్షన్ వరకు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

మంత్రి అనగానిని కలిసి గళ్లామాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వెలగపూడి సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సత్య ప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై ఆమె చర్చించారు.

నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళి

రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణపు పనుల పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలో మండలం లోని సాతులూరు గ్రామం వద్ద నిర్మిస్తున్న రైల్వే గూడ్స్ షెడ్ ను జిల్లా వ్యవ సాయ శాఖాధికారి మురళి గురు వారం పరిశీలించారు. రైల్వే కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించి త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ షెడ్డు నిర్మాణం జరిగితే పల్నాడు జిల్లా రైతులకు ఎరువులు కంపెనీ నుండి రైల్వే ద్వారా సరఫరా జరుగుతుందని రైతు లకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం సాతు లూరు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి సిసిఆర్‌సి పురోగతిపై వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకుల సమీక్షించి ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి ప్రతి కౌలు రైతును గుర్తించి వారికి సిసిఆర్ సి అందేలాగా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. కార్య క్రమంలో జిల్లా వ్యవసాయ సహా య అధికారి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్, విఆర్ఒ అంజలీదేవి, రైతు భరోసా కేంద్ర నిర్వహణ రామారావు వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆహార కల్తీలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గుంటూరు

కల్తీ ఆహారాలతో ప్రజారోగ్యం దెబ్బతింటోందని, ఏది తినాలన్నా భయపడే రోజులు వచ్చాయని అవగాహన సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వ్యాపారాలను పెంచుకునేందుకు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కె.రామరెడ్డి గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. కల్తీ ఆహార పదార్థాల వల్ల దీర్ఘకాలంలో బీపీ, షుగర్, జీర్ణకోశ వ్యాధులు చుట్టుముడుతున్నాయని, వీలైనంత వరకూ రోడ్డు పక్కన ఆహార పదార్థాలు తినొద్దని కోరారు. కల్తీల నియంత్రణంలో ప్రభుత్వ విభాగాలు విఫలమవుతున్నాయని, ఆహారా పదార్థాలపై పన్నుల రూపంలో వసూలు చేస్తున్న బొత్తంలో నామమాత్రంగానైనా కల్తీల నియంత్రణకు ఉపయోగించడం లేదని విమర్శించారు.

తల్లీబిడ్డ మృతి కారకులపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విజయపురిసౌత్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 17న పురిటి బిడ్డతోపాటు తల్లి పావని మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా ఆరోగ్య సేవల కో-ఆర్డినేటర్ (డిసిహెచ్ఎస్) రంగారావు తెలిపారు. విచారణ నిమిత్తం ఆస్పత్రికి గురువారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. తల్లీబిడ్డ మృతిపై తాను విచారణ చేస్తున్నానన్నారు. గర్భిణికి బీపీ అధికమైందని, కడుపులో శిశువు పెద్దగా ఉండడంతోపాటు ఉమ్మనీరు తాగడంతో ఊపిరాడక చనిపోయిందని చెప్పారు. ఇదే క్రమంలో గర్భిణికి రక్తస్రావం అధికం కావడం వల్ల ఆమె మరణించారని చెప్పారు. ప్రసవం చేయడంలో చిన్నచిన్న లోపాలతోపాటు బాధ్యతా రాహిత్యం, ఏడాది నుభవమే ఉన్న కొత్త డాక్టర్లయిన వారు ఉండడం తదితర కాణాలతో అడ్మినిస్ట్రేటివ్ అవగాహన లోపంతో ఈ ఘటన జరిగిందని అన్నారు. దీని పూర్తి బాధ్యత డాక్టర్లపై ప్రసవం చేసిన నర్సులపై ఉంటుందని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ముగ్గురితో కూడిన ఎంక్వైరీ కమిటీ వేశామని, అందులో సివిల్ సర్జన్ గైనకాలజిస్ట్, సివిల్ సర్జన్ పీడియాట్రి, సివిల్ సర్జన్ జనరల్ ఉన్నారని, ఈ కమిటీ నివేదిక ప్రకారం బాధ్యులైన డాక్టర్లు, నర్సులకు కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయడంలో భాగంగా ఒకరికి హాస్పిటల్లో ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేయిస్తామన్నారు. మూడేళ్లుగా హాస్పిటల్లో ఎన్నో ప్రసవాలు చేసి మంచి పేరు తెచ్చుకున్నామని, మరోసారి ఇలాంటి ఘటనలు జరగనివ్వబోమని అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- చేబ్రోలు

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత బి ప్రధానోపాధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల13వ తేదీ నుండి 20 వరకు ప్రతిరోజు ఒక అంశాన్ని తీసుకుని విద్యార్థులకు అవగాహన కల్పించు పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు చెప్పారు. ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ

దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని ఈ సంవత్సరము ఈకో క్లబ్స్ మిషన్ లైఫ్ థీమ్తో నో సే టు సింగిల్ యూస్ ప్లాస్టిక్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ కొరకు వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. జూన్ 5న పర్యావరణ దినోత్సవ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటారు. 13వ తేదీన హెల్తి లైఫ్ స్టైల్, 14న రెడ్యూస్ వేస్టేజ్,15న రెడ్యూస్ ఈ వేస్టేజ్, 18న సస్టైనబుల్ ఫుడ్ సిస్టం, 19 తారీకు సేవ్ ఎనర్జీ, 20న సేవ్ వాటర్, ఆరు రోజులు పాటు ఆరు అంశాలపై విద్యార్థులకు వారోత్సవాలలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులు డివి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించడం పట్ల విద్యా

ర్థులకు అవగాహన కల్పించామన్నారు. వారోత్సవాల్లో చివరి రోజు గురువారం పర్యావరణ సమతుల్యతకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని వేస్టేజ్ తగ్గించాలని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతను గుర్తించి సహకారం అందించాలని విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో సైన్స్ ఉపాధ్యాయులు డి వి శ్రీనివాస్ ఎన్ రాధాకష్ణమూర్తి, ఎం వెంకటేశ్వరరావు, ఏ శ్రీనివాసరావు, బి వెంకటేశ్వరరావు, డి.పరిశుద్ధం, కె.అరుణకుమారి పాల్గొన్నారు.

తారక్‌నాథ్ వర్ధంతి సందర్భంగా వితరణలు

ప్రజాశక్తి - గుంటూరు

ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ, జనరల్ సెక్రటరీ, ఎస్.బి.ఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ నేత తారకనాథ్ 20వ వర్ధంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంపాలెంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్, గుంటూరు మాడ్యూల్ పరిధిలోని అన్ని బ్రాంచీలలో సభ్యులు నివాళులర్పించడంతోపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత మెయిన్ బ్రాంచ్‌లో జరిగిన వర్ధంతి సభలో తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలేశారు. కార్యక్రమానికి గుంటూరు మాడ్యూలు, డిప్యూటి జనరల్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసాచార్యులు, ఎజిఎఫ్‌లు కోటిరెడ్డి, నరేంద్రతో పాటు ఇతర యూనియన్ నాయకులు, బ్రాంచి అధికారులు పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని 'రామకృష్ణ శారదా విద్యాలయ'లో చదువుకుంటున్న పేద విద్యార్థినులకు యూనిఫాంలను అందించారు. కాజా గ్రామంలోని 'ఆమోదిని బాలికల హోమ్'లో నిత్యావసర సరుకులను అందించారు. పొన్నూరు మండలంలోని బ్రాహ్మణకోడూరులోని చిన్నపిల్లల ఆశ్రమంలో నిత్యావసర సరుకులు అందించారు. చివరిగా గుంటూరు మెయిన్ బ్రాంచ్ ఆవరణలో జరిగిన వర్ధంతి సభలో పలువురు

మాట్లాడుతూ తారకనాథ్ చేసిన సేవలు సజీవంగా ఉంటాయని, బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఆయన నిరంతరం పాటుపడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయన్ను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, జయకుమార్, సునీత, కష్ణమోహన్, రంగసాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ లోకల్ బ్రాంచీల్లో పనిచేస్తున్న సుమారు 130 మందికి పైగా తాత్కాలిక సిబ్బందికి గృహోపకరణాలను బహూకరించారు.

మాయా మిర్చిందా?

(మొదటి పేజీ తరువాయి)

మిర్చి బస్తాలు నిల్వ ఉంచినట్లు అంచనా. ప్రధానంగా శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్, నైజీరియా, సింగపూర్, స్వీడన్ తదితర దేశాలకు ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ ఏడాది రాష్ట్రంలో మిర్చి ఉత్పత్తి తగ్గినా 2023-24 సీజన్‌లో ఇతర రాష్ట్రాల్లో విస్తీర్ణం, ఉత్పత్తి పెరిగాయని, అందువల్ల ఆశించిన స్థాయిలో ఎగుమతి ఆర్డర్లు రాలేదని, అందుకే ధర తగ్గుతోందని వ్యాపారి సురేష్‌రెడ్డి చెప్పారు. స్థానికంగా మిర్చికి డిమాండ్ తగ్గిందని తెలిపారు. పచ్చళ్ల సీజన్, శుభకార్యాక్రమాలు లేకపోవడం వల్ల వినియోగం తగ్గడం వల్ల ధరలు తగ్గడానికి కారణమన్నారు.

నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం పెత్తనం చేసేందుకే నీట్ పరీక్షను దేశ వ్యాప్తంగా ఒకేసారి, ఒకే పరీక్ష నిర్వహిస్తోందని, రాష్ట్రాల పరిధిలో పరీక్షలు నిర్వహిస్తే ఇటువంటి లోపాలు జరిగే అవకాశం తక్కువని, జరిగినా ఆ రాష్ట్రానికి మాత్రమే పరిమితం అవుతాయని అన్నారు. ఇవేమీ పట్టని కేంద్రప్రభుత్వం తన పెత్తనం కోసం నీట్ పరీక్షను నిర్వహిస్తూ దానిలోని లోపాలను సరి చేయకుండా పేపర్ లీకేజీలు, పరీక్షా ఫలితాల్లో అనేక అవకతవకలు జరగటం దేశ భవిష్యత్తుకు చాలా ప్రమాదమని చెప్పారు. సుప్రీం కోర్టు సైతం నీట్ ఎగ్జామ్ నిర్వహణలో అవకతవకలు జరిగాయని, వాటిని అంగీకరించాలి అని సూచించినా ఇంతవరకు నీట్ పరీక్షను రద్దు చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ, మరికొన్ని రాష్ట్రాలు నీట్ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించు కుంటామని ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య విద్య ప్రవేశ పరీక్ష మన రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.సుచరిత, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుభాష్, నాయకులు యశ్వంత్, షంషిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా చౌటుప్పల్‌కు చెందిన అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్ అలియాస్ మణి, కృష్ణాజిల్లా మచిలీపట్నం మాచవరంపేటకు చెందిన దాసరి సాయిశంకర్ భవాని, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన రామిశెట్టి శ్యామ్ వెంకట్ అలియాస్ బబ్లూ, విజయవాడ సిటీ తాడిగడపకు చెందిన ఉయ్యూరు కౌశిక్‌రెడ్డి, తెనాలిలోని నందులపేటకు చెందిన సాయికోటి మంజునాథ, అదే ప్రాంతంలోని మంద వారి వీధికి చెందిన దేవిశెట్టి బసవేశ్వరరావు, పెదకాకాని మండలం వెంకటకష్ణాపురానికి చెందిన అమ్మిశెట్టి మణికంఠ ఉన్నారు. వీరంతా గంజాయికి బానిసలేనని, దాదాపు అందరూ వివిధ ప్రాంతాల్లో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారని డీఎస్పీ తెలిపారు.

వీరు చౌకగా కొనుగోలు చేసిన గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ముఠాను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సిఐ ఎ.సుధాకర్, ఎస్ఐలతో పాటు సిబ్బంది మహమ్మద్ హనీఫ్, వెంకయ్య, సాంబశివరావు, వెంకటప్రసాద్, దేవదాసు, గణేష్ బృందాన్ని డీఎస్పీ ఎం.రమేష్ అభినందించారు.

చట్టంలో మార్పు .. కౌలు రైతుకు ఓదార్పు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రస్తుతం వ్యవసాయ రంగంలో కౌలు రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని సంవత్సరాల పాటు సిపిఎం, కౌలు రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాయి. ఆ ఉద్యమ ఫలితమే 2011లో కౌలు దారులకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చారు. ఆ చట్ట ప్రకారం గ్రామసభలు నిర్వహించి వీఆర్వోలు వ్యవసాయ శాఖ అధికారులు నేరుగా రైతులకు కౌలు కార్డులు ఇచ్చే అవకాశం ఉన్నది.

వైసిపి హయాంలో..

2019లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆ చట్టంలో మార్పులు తీసుకొచ్చారు. ఆ మార్పులు కౌలు రైతుల పాలిట శాపంగా మారాయి. కౌలు కార్డు కావాలంటే భూ యజమాని పొలం జిరాక్స్ కాపీ తో పాటు ఒప్పంద పత్రంపై అతని సంతకం కూడా కావాలని చట్టంలో మార్పులు చేశారు. దీంతో పొలం కౌలుకి ఇచ్చిన సంతకాలు చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో కౌలు కార్డు గగనంగా మారింది. వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతులతో రాయబారాలు నడిపి కౌలు కార్డులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని వైసిపి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఊదరగొట్టింది. ఆచరణలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉన్నది. దీంతో కౌలు రైతులకు ఉన్న రక్షణ కాస్త సన్నగిల్లిపోయింది. కార్డు దక్కకపోవడంతో ప్రభుత్వం నుంచి అందే రాయితీలు అందని ద్రాక్షగా మారాయి. సబ్సిడీపై అందించే విత్తనాలు, ఎరువులు కొనుగోలు, పంటల బీమాకు గాని కార్డు తప్పనిసరి. కార్డు రాకపోవడంతో వచ్చే రాయితీలన్నీ అటకెక్కాయి.

మార్పులు ఏమి చేయాలంటే!

కౌలు రైతులను గుర్తించటానికి ఇంటింటికి సర్వే నిర్వహించడం. ఆ సర్వేలో వాలంటీర్లు అధికారులు ఆధ్వర్యంలో చేపట్టాలి. అప్పుడు మాత్రమే కౌలు రైతులు ఎవరు ఎంత భూమి సాగు చేస్తున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. యుద్ధ ప్రాతిపదికన పది రోజుల్లో కార్డులు మంజూరు చేయవచ్చు. దీంతో కౌలు రైతులకు ఉపశమనం కలుగుతుంది. వ్యవసాయ రంగంలో వచ్చే ఆటుపోటులకు కొంతమేర కౌలు రైతులు తట్టుకోవచ్చు. ఈ మార్పుల వల్ల కౌలు రైతులకు ఓదార్పు కలుగుతుంది.

పెదకూరపాడు నియోజకవర్గంలో 1,34,497 ఎకరాలు భూమి సాగులో ఉంది. ఈ భూమి 68,230 రైతుల పేర్ల మీద నమోదయింది. ఈ భూమి మొత్తంలో చిన్న, సన్నకారు రైతులు తో కలుపుకొని 70 శాతం కౌలు రైతులు భూమి సాగు చేస్తున్నారు. కౌలు కార్డులు 10989 ఇవ్వాలని నిర్ణయించారు. ప్రకతి సహకరించకపోవడం, పాలకులు కరుణించకపోవడంతో కౌలు రైతుల మాత్రమే ఆత్మహత్యలు చేసుకునే దశకు నెట్టబడుతున్నారు. గతంలో పలు సంఘటనలు జరిగాయి. ఇటువంటివి లేకుండా ఉండాలంటే నూరుశాతం ఇంటింటికి తిరిగి విచారించి నూరు శాతం కార్డులు ఇవ్వవలసిన అవసరం ఉంది.

లోసుగులు ఆధారంగా..

చట్టంలో లోసుగులను ఆధారం చేసుకుని సాగు చేయని వ్యక్తులు కూడా కార్డులు పొందుతున్నారు. దీనికి రాజకీయాలను అస్త్రంగా వినియోగిస్తున్నారు. ప్రతి గ్రామానికి పది నుంచి 20 వరకు కౌలు కార్డులు ఇవ్వాలని టార్గెట్ ఇస్తున్నారు. గ్రామాన్ని బట్టి మార్పులు చేర్పులు ఉంటాయి. దీన్ని ఆసరాగా చేసుకుని అధికారులపై ఒత్తిడి పెంచి ఏదోక సర్వే నెంబరు వేయించుకొని కార్డులు పొందిన సంఘటనలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయి. ఇటువంటి ఘటనతో నిజమైన లబ్ధిదారుడు నష్టపోయాడు. పైరవీ కారులకు వచ్చే పైసలు దక్కాయి. ఇప్పటికైనా టిడిపి ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కౌలు చట్టంలో మార్పులు చేసి రైతులకు ఓదార్పు కల్పించాలి.

కౌలు రైతులందరికీ కార్డులివ్వండి

కౌలు రైతు చింతకాయల అప్పారావు, క్రోసూరు

చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులందరికీ కార్డులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని క్రోసూరు గ్రామానికి చెందిన చింతకాయల అప్పారావు కోరారు. కార్డులు రాకపోవడం వల్ల ప్రభుత్వం అందించే రాయితీలు కూడా రావడం లేదన్నారు. కౌలు కార్డు రాకపోవడం వల్ల బ్యాం కులో రుణాలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. టిడిపి ఆధ్వ ర్యంలోని కూటమి ప్రభుత్వం స్పందించి చర్యలు తీసు కోవాలన్నారు.

రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసిన జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ :రాష్ట్ర సచివాలయ స్థాయి నుంచి గ్రామ/వార్డు సచివాలయాల వరకు ప్రభుత్వ వ్యవస్థల్లో తిష్ట వేసిన వైసిపి వేర్లన్నింటినీ కత్తిరించాల్సిన తరుణం ఆసన్నమైందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. కన్సల్టెంట్‌లు, సలహాదారులు, ప్రత్యేక ఉద్యోగుల పేరిట ఎక్కడబడితే అక్కడ చొరబడిన వారంత ఇంతకాలం ప్రజాధనాన్ని పప్పు బెల్లాల్లా పంచుకు తిన్నారని విమర్శిం చారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ గురువారం సచివాలయంలో పలువురు మంత్రులను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ఓ మొక్కను అందజేశారు.

మిర్చి నిల్వలు	
	బ్యాగులు
మిర్చి దిగుమతి :	51,771
మిర్చి ఎగుమతి :	50,599
మిర్చి నిల్వ :	18,079
మిర్చి ధరలు	
	రూపాయలలో
334	8,000 - 17,500
నెం.5	9,000 - 15,000
273	9,000 - 15,500
341	8,000 - 17,000
సూపర్ 10	14,500 - 14,500
నాన్ ఎసి	
తేజ	7,500 - 20,000
బడిగి	9,000 - 16,500
దేవనూరు డీలక్స్	10,000- 15,000
తాలుకాయలు	4,500 - 11,500
ఎసి	
334	9,000 -16,000
నెం.5	15,000 - 15,000
273	14,000 - 14,000
341	8,000 - 17,000
4884	17,200 -17,200
తేజ	8,500 - 19,700
బడిగి	10,000 - 17,000
దేవనూరు డీలక్స్	14,000 - 14,000
తాలుకాయలు	5,000 -12,500

విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం

స్టూడెంట్స్ కిట్స్ పంపిణీలో ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాణ్యమైన విద్యా బోధన ద్వారానే సమాజంలో మార్పులు వస్తాయని ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టూడెంట్ కిట్స్ పేరిట ఏర్పాటు చేసిన కిట్లను గురువారం నరసరావుపేట నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మార్పులు కోరుకునే ప్రతి ఒక్కరూ విద్యా వ్యవస్థలో మార్పుల్ని

స్వాగతించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టూడెంట్స్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసు కోవాలన్నారు. ప్రతి విద్యార్థి తోటి విద్యార్థితో కుల మతాలకు అతీతంగా స్నేహపూర్వకంగా ఉండాలని లక్ష్యం నిర్దేశించుకుని లక్ష్యసాధనకు కషి చేయాలి అన్నారు.

వ్యవసాయ,ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతున్న అరవిందబాబు

వ్యవసాయ రంగాన్ని రాయితీలతో ప్రోత్సహిస్తాం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు అనేక రాయితీలతో ప్రోత్సాహాన్ని అందించి, వ్యవసాయాన్ని లాభసాటి చేయడమే టిడిపి లక్ష్యమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మున్సిపల్ అతిథిగృహంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నదుల అనుసంధానంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ముందు చూపుతో ఉన్నారని ,ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రభుత్వానికి రైతులకు అనుసంధానంగా వ్యవహరించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో అనుసరిస్తున్న విధానాలను కూడా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 'రైతు రథం' పేరిట ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రే యర్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులు, రోటవేటర్లు, పంపుసెట్లు, తదితర వ్యవసాయ పరికరాలతో పాటు జింకు, జిప్సం,గంధకం వంటి సూక్ష్మ ఎరువులు పంపిణీ చేసిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు.వైసిపి పాలనలో వ్యవసాయ రంగాన్ని ఏ విధంగాను ప్రోత్సహించిన దాఖలాలు లేవన్నారు. మండల, గ్రామ వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు అందజేయాలని ఆదేశించారు. రైతులు లాభసాటి వ్యవసాయం చేసి ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. సాగునీరు వృథా కాకుండా సక్రమంగా రైతులకు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ పి.మస్తానమ్మ, నరసరావుపేట మండలం వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు, ఎన్.ఎస్.పి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నందమూరి బసవతారకం- నల్లపాటి వెంకట్రావు చౌదరి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో పల్నాడు రోడ్డులో గల నందమూరి బసవతారకం నల్లపాటి వెంకట్రావు చౌదరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇన్-ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ - పొలి టికల్ సైన్స్, బీకాం - కంప్యూటర్ అప్లికేషన్, బిఎస్సి- జువా లజీ, బిఎస్సి- కంప్యూటర్ సైన్స్, బిఎస్సి- మ్యాథమెటిక్స్, కోర్సు లలో బోధన అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని హెల్ప్ డెస్క్ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440184788, 8186864847 నంబర్లలో సంప్రదించాలన్నారు. డిగ్రీలో చేరేందుకు వచ్చే విద్యార్థులు ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్ టి.సి, మార్కుల ధ్రువీకరణ,విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డ్, ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నెంబర్, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో రావాలన్నారు.

కాపు జేఏసీ మాచర్ల పట్టణ యూత్ అధ్యక్షుడిగా గొబ్బూరి లక్ష్మణ్

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గ కాపు జేఏసీ అధ్యక్షులు పసుపులేటి బ్రహ్మనాయుడు కాపు జేఏసీ మాచర్ల పట్టణ యూత్ అధ్య క్షుడిగా గొబ్బూరి లక్ష్మణ్‌ను నియమిస్తూ నియామకపత్రం అంద జేశారు. కాపు జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు అమ్మ శ్రీని వాస్ నాయుడు ఆదేశాలమేరకు ఈ నియామకం జరిగింది. మాచర్ల మండల అధ్యక్షులు జె.నరసింహారావు, పట్టణ కాపు నాయకులు ఎన్.చెన్నకేశవరావు, పగడాల సుబ్బా రావు, పగ డాల సుధాకర్, నక్షత్రపు కేశవ, నక్షత్రపు రాంబాబు, నక్షత్రపు రమేష్, బత్తుల కొండ, గొబ్బూరి నరసింహారావు, నక్షత్రపు నరేష్, రాయుడుప్రసాద్, గొబ్బూరి అమరలింగేశ్వరరావు పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

I, **SATTI VENKATA KRISHNA REDDY S/o. VENKATA REDDY,** R/o. Plot No. 6, SCNo. 70024, 1st Line, Sairam Township, Narasaraopet, Palnadu District.A.P. Have lost my original Passport Bearing No.**Z6597848,** While I was going to take xerox, Near GBR Hospital, Palnadu Road, Narasaraopet on 18-06-2024 on my two wheeler. If any one found plz call: **9177984735**

ఒరిజినల్ దస్తావేజు పోయినది

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం లాం గ్రామం డోర్ నెంబర్ 9-66 రులో నివాసం,కుర్రా సుబ్బరావు గారి కుమారుడు కుర్రా ప్రభాకరరావు వున్న క్రింది విరములతో కూడిన ఒరిజినల్ దస్తావేజు పోయినది. తేది.18-01-2024 న నేను మా ఇంటి నుండి బైక్ పై తాడికొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి పని చూసుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా బైక్‌లో ఉన్నటువంటి ఒరిజినల్ దస్తావేజు కవర్ పోయినది. ఆ కవర్ నందు పొలానికి సంబంధించినటువంటి డి.నెం 182 మరియు య 0-50 శెంట్లు గాల పొలం ద.నెం 1636/2002 రు యొక్క ఒరిజినల్ దస్తావేజు పోయినది. సదరు ఒరిజినల్ - దస్తావేజు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు గాని, ఫోన్ నెంబరుకు గాని తెలియపరచవలసినదిగా - కోరుతున్నాను.

ఇట్లు
కుర్రా సుబ్బారావు,
డోర్ నెం 9-66, లాం గ్రామం,
తాడికొండ మండలం, గుంటూరు జిల్లా.
ఫోన్ : 9441820614

పంక్చర్ గమ్‌తో బతుకులకే పంక్చర్

- మత్తు ప్రేరకంగా గమ్ సొల్యూషన్లు
- డ్రగ్స్ తరహాలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న యువత
- భిక్షాటనలో పసిపిల్లలకు ఇస్తున్న వైనం
- నియంత్రించకుంటే పెనుముప్పే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మార్కెట్లో తక్కువ ధరలకు లభించే గమ్ సొల్యూషన్లను (పంక్చర్ గమ్) మత్తు కలిగించే ప్రేరకంగా కొందరు వినియోగిస్తున్నారు. ఒకరిని చూసి ఒకరు వీటికి అలవాటు పడుతున్నారు. ఒక్కసారి అలవాటయ్యాక దాన్నుండి బయటపడలేక బానిసలుగా మారుతున్నారు. మద్యం, గంజాయిలకు మించి చాపకింద నీరులా ఈ మత్తు వ్యసనం వ్యాపిస్తోంది. పంచర్లు వేసుకోవడానికి వాడే వస్తువులతో అనేక మంది యువకులతోపాటు చిన్నారులూ తమ జీవితాలనే పంచర్ చేసుకుంటున్నారు.

పట్టణంలోని నెహ్రూనగర్, గుర్రాలచావిడి, తూర్పుమాలపల్లె, సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో వీటి వాడక ఎక్కువగా ఉంటోంది. ఊరి బయట పొలాలు, పాతభవనాల్లో కూర్చుని యువకులు వీటిని వినియోగిస్తున్నారు. చేతిరుమాలులో సొల్యూషన్ పేస్టు వేసి నోటితో పీలుస్తూ మత్తులో తూగుతున్నారు. 100 గ్రాముల లోషన్ ట్యూబ్‌ను తడవకు 20-25 గ్రాములు వేసుకుని నోటి ద్వారా గట్టిగా పీలిస్తే వచ్చే మత్తు ప్రభావం సుమారు గంటా రెండు గంటల వరకు ఉంటుంది. ఇలా రోజుకు కనీసం రెండు మూడు సొల్యూషన్ల ట్యూబులను పీల్చేవారున్నారంటే దీనికి ఎంతలా బానిసలుగా మారుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పసిపిల్లలను సంకలో పెట్టుకుని భిక్షాటన చేసే మహిళలు తమ పిల్లలకు గమ్‌సోల్యూషన్ మత్తును ఇస్తున్నారు. వీటి ప్రభావం వల్ల ఆ పిల్లలు ఎండైనా, వానైనా ఏడవకుండా చంకల్లోనే వేళ్లాడుతున్నారు. ఇలా పీల్చిన వారు కేవలం నెలల వ్యవధిలోనే తీవ్ర అనారోగ్యానికి గురై ప్రాణాపాయస్థితికి చేరతారని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల నెహ్రూ నగర్‌లో ఒకరికి గమ్‌సొల్యూషన్ పీల్చడం వల్ల గుండె బాగా దెబ్బతిని మృత్యువాతా పడ్డారు.

పంక్చర్లు వేయడానికి వాడే గమ్

సాధారణంగా గమ్ సొల్యూషన్లను వివిధ రంగాల్లో వస్తువులను అతికించేందుకు వినియోగిస్తారు. వీటిలోని రసాయనాలకు త్వరగా ఆవిరయ్యే గుణం ఉంటుంది. ఈ రసాయనాల ఆవిరి, ఘాటు కారణంగా కళ్ల మంట, తల తిరగటం తదితర సమస్యలొస్తాయి. వీటిని పని కోసం వాడే సమయంలో కార్మికులు ముక్కుకు గుడ్డ కట్టుకుని వీటి దుష్ప్రభావాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటిస్తారు. టీవీ మెకానిక్‌లు, చెప్పుల తయారీ కార్మికులు వారి పనుల కోసం వీటిని వాడుతుంటారు. ఎలక్ట్రానిక్ దుకాణాల్లో లభ్యమయ్యే వీటిని వీటిని ఎవరికంటే వారికి విక్రయించకూడదనే నిబంధనలున్నాయి. వీటిని వినియోగించే రంగాల్లో పనిచేసే వ్యక్తులు, కార్మికులకే విక్రయించాలి. మైనర్లకు అమ్మకూడదు. వీటి కొనుగోలుకు వచ్చే వారిపట్ల విక్రేతలకు అనుమానం కలిగితే పోలీసులకు, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఆ నిబంధనలను ఇక్కడెవరూ పాటించడం లేదు. కొన్ని దుకాణాల్లో రోజుకు 70-100 వరకూ గమ్‌సొల్యూషన్ ట్యూబులు అమ్ముతుండడం మీరుతున్న నిబంధనలకు నిదర్శనంగా నిలుస్తోంది. దీనిపై అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, యువత మత్తులో చిత్తవకుండా, ఆరోగ్యాలను నాశనం చేసుకోకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సబ్సిడీపై టమోటాల విక్రయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బహిరంగ మార్కెట్లో కిలో టమోటాల ధర రూ.90-100 వరకు ఉన్న నేపథ్యంలో స్థానిక రైతు బజారులో సబ్సిడీపై కిలో టమోటాలు రూ.64 చొప్పున అందుబాటులో ఉంచామని రైతు బజార్ ఎస్టేట్ అధికారి ఖాజావలి గురువారం తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతానికి 25 కిలోల బాక్సు ట్రేలు 60 (15 క్వింటాళ్లు) వచ్చాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా పచ్చిమిర్చి ధర ప్రస్తుతం రూ.70, మిగతా కూరగాయల ధరలు కిలో రూ.60కుపైగానే ధరలు పలుకుతున్నాయి.

గర్నెపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలేస్తున్న లక్ష్మీనారాయణ

గర్నెపూడి , కొమెరపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలోని గర్నెపూడిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పర్యటించారు. ఎన్టీఆర్, కోడెల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించగా ఆయన్ను టిడిపి నాయకులు సత్కరించారు. అనంతరం కొమెరపూడిలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక చర్చిని సందర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు ఎ.సాంబయ్య పాల్గొన్నారు.

హోటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్లో ఏర్పాటు చేసిన హోటల్ ఆనంద్ భవన్‌ను ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. భోజన ప్రియులకు రుచికరమైన, నాణ్యమైన వంటకాలను అందించి కష్టమర్ల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను హోటల్ నిర్వాహకులుః సన్మానించారు.

బడిబయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించడి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులను ఎంఇఒ-1 ఎ.శ్రీనివాసరావు ఆదేశించారు. 'నేను బడికిపోతా' కార్యక్రమంపై సత్తెనపల్లి జెడ్‌పి పాఠశాలలో హెచ్ఎంలో గురువారం సమావేశమయ్యారు. వచ్చేనెల 12వ తేదీ వరకూ ఈ కార్యక్రమం ఉంటుందని, రోజుకు ఎంత మందిని బడి బయట ఉన్న పిల్లల్ని బడిలో చేర్పించారో నివేదికివ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఎ.రాఘవేంద్రరావు, సీఆర్పీలు నరేంద్ర, ప్రసాద్, శ్రీకాంత్, నీరజ, మల్లీశ్వరి, ప్రశాంతి, ఇందిరా పాల్గొన్నారు.

భూ యజమాని సంతకంపై చట్ట సవరణ చేయాలి

- గ్రామసభలో తహశీల్దార్, ఏవోకు కౌలురైతు సంఘం వినతి
- దరఖాస్తు చేసుకుంటే భూ యజమానులతో తాము మాట్లాడతామన్న అధికారులు

ప్రజాశక్తి - క్రోసూరు

సభలో మాట్లాడుతున్న తహశీల్దార్

భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసేలా చట్టాన్ని సవరించాలని కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా నాయకులు టి.హనుమంతరావు కోరారు. యర్రబాలెం సచివాలయం (క్రోసూరు-3) వద్ద మండల వ్యవసాయాధికారి వేణుగోపాలరావు అధ్యక్షతన కౌలురైతుల గ్రామసభ గురువారం నిర్వహించారు. కౌల్దార్ల సమస్యలను హనుమంతరావు ప్రస్తావించారు. కౌలురైతులను గుర్తించాలంటే భూ యజమాని సంతకం చేయాలనే నిబంధనలతో గత ప్రభుత్వం 2019లో చట్టం తేవడం వల్ల గ్రామాల్లోని మొత్తం కౌల్దార్లలో 20-30 శాతానికి మించి గుర్తింపు కార్డులు పొందలేకపోయారని, దీంతో వాస్తవ సాగుదార్ల పేర్లు ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు కాలేదని, రాయితీ విత్తనాలు, పంట నష్టపరిహారం అందలేదని, పంటల బీమాకూ అర్హులు కాలేకపోయారని వివరించారు. భూమిలేని ఓసీ సామాజిక తరగతి కౌలురైతులకూ గుర్తింపుకార్డులిచ్చి రైతు భరోసాను వారికీ అమలు చేయాలని అన్నారు. అనంతరం తహశీల్దార్, ఏవో మాట్లాడుతూ కౌల్దార్లకు కార్డుల విషయంలో భూ యజమాని నుండి ఏమైనా ఇబ్బందులుంటే కౌల్దార్లు అర్జీ ఇచ్చినానం తరం తాము మాట్లాడతామని చెప్పారు. గ్రామ సభలను ఉపయోగించుకుని ఎక్కువ మంది కౌలురైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దేవాదా యశాఖ భూములను సాగుచేసేవారికి ఈవో ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేయిస్తామని చెప్పారు.

డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల్లో పిఎంసి అండ్ కెఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

రాజేష్, అల్లాబక్షు, నాగమణి, రేవతి, హనిలత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గురువారం విడుదల చేసిన డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాల్లో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్డులో గల పాలడుగు నాగయ్య చౌదరి అండ్ కొత్త రఘురామయ్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. బిసిఎలో నామేపల్లి రాజేష్ 91.70 శాతం మార్కులతో ప్రథమ స్థానం సాధించగా బండారం శ్రీలాస్య 87.88 శాతం మార్కులతో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బీకాం జనరల్‌లో పి.అల్లాబక్షు 80.5 శాతంతో మొదటి స్థానం సాధించగా మార్త గీతిక 76.17 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, బీకాం కంప్యూటర్స్‌లో రేపూడి నాగమణి 83.29 శాతం మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, ఎ.షాజన్ 80 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, బిఎ కంప్యూటర్‌లో గుర్రపుసాల రేవతి 80.43 శాతం మార్కులతో మొదటి స్థానం, నంద వెంకటేష్ 72.71 శాతం మార్కులతో ద్వితీయ స్థానం, బిఎ లిటరేచర్‌లో గుడిసె హనిలత 75 శాతం మార్కులతో మొదటి స్థానం, ఉసురుపాటి వినోద్ 72 శాతం మార్పులతో ద్వితీయ స్థానం సాధించారని వివరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్, ట్రెజరర్ డాక్టర్ ఎం.అన్నపూర్ణమ్మ, జాయింట్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ పాలడుగు శ్రీనివాస ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డి.రాధాకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

కార్మికులను తొలగిస్తే సహించబోము

న్యాయమైన జీతాలిచ్చి పనిభద్రత కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు ప్రాతిపదికన స్వీపర్లుగా పనిచేస్తున్న మహిళా కార్మికులను రోజువారి విధులకు అదనంగా పనులు చేయిస్తూ వారిపై పని ఒత్తిడి పెంచుతున్నారని సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఆర్టీసీ డిపో నుండి బస్టాండ్ వరకు మహిళా కార్మికులతో రోజుకు 20 వాటర్ క్యాన్లను మోపిస్తున్నారని, తాము మోయలేమని కార్మికులు ఎస్టిఐకు చెప్పగా అలాగైతే పనిలోకి రావొద్దన్నారని, దీనిపై కార్మికులు కాంట్రాక్టర్‌ను సంప్రదించగా ఆ పని మీరు చేయనవసరం లేదని చెప్పారని వివరించారు. కార్మికులకు నెలకు పిఎఫ్, ఇఎస్ఐను మినహాయించి రూ.9,900ను కాంట్రాక్టర్ ఇవ్వాల్సి ఉండగా గత మార్చిలో రూ.7500, ఏప్రిల్ తర్వాత రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నెలకు నాలుగు వారాంతరపు సెలవులు, పండగ సెలవులు ఇవ్వాల్సి ఉండగా ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని, దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి సిఐటియు నాయకులు వెళ్లగా దాన్ని తీసుకోవడానికీ ఆయన నిరాకరించారని తెలిపారు. తమకు సంబంధం లేదంటూ కాంట్రాక్టర్‌తో మాట్లాడుకోవాలన్నారని, కాంట్రాక్టర్‌తో మాట్లాడటానికి ప్రయత్నించగా యూనియన్లకు, తనకు సంబంధం లేదు.. మీతో మాట్లాడాల్సిన అవసరమూ లేదు.. ఈ రోజు నుండి కార్మికులను తొలగిస్తున్నాను అంటూ మాట్లాడారని తెలిపారు. కార్మికులను తొలగిస్తే ఊరుకోబోమని, వారికి పని భద్రత కల్పించడంతోపాటు చట్ట ప్రకారం రావాల్సిన జీతం చెల్లించాలని, సెలువులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకోసారి లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా వచ్చే జీవోలను కార్మికులకు అందుబాటులో ఉంచాలన్నారు. జీతాలు తగ్గించి ఇవ్వడంలో కాంట్రాక్టర్, డిపో మేనేజర్ కుమ్మక్కయ్యారని, ఉన్నతాధికారులు పరిశీలించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే కార్మికుల పక్షాన సిఐటియు ఉద్యమిస్తుందని హెచ్చరించారు. సమవేశంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటకృష్ణ, బి.నాగేశ్వరరావు, శేషారావు పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు వెంటనే ప్రభుత్వం రూ.20 వేలు పెట్టుబడి సహాయాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అన్నారు. గురువారం మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల రైతు సంఘం అధ్యక్షులు జి బాబు వరప్రసాద్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య తన ప్రసంగానికి కొనసాగిస్తూ దేశ వ్యాప్తంగా రైతులు కేంద్ర కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతాంగ వ్యతిరేక విధానాలపై చేసిన పోరాట ఫలితంగానే బిజెపికి సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు తగ్గాయని అన్నారు. రైతాంగానికి అన్ని రకాల పంటలకు కనీసం మద్దతు ధర ప్రకటించకపోవడం వలన దేశ వ్యాప్తంగా రైతులు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు నష్టపోతున్నారని అన్నారు. రెండు లక్షల రూపాయలు లోపు ఉన్న వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, సకాలంలో అందించాలని అన్నారు. గుంటూరు ఛానల్‌లో ఉన్న తూటుకాడ, గుర్రపు డెక్క తొలగించాలని కోరారు. పెదవడ్లపూడి హై లెవెల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన రైతాంగ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్ వద్ద వినతి పత్రం అందజేస్తున్నట్లుగా తెలపారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం మంగళగిరి మండల కార్యదర్శి బి ప్రసాద్ రెడ్డి, రైతు సంఘం నాయకులు ఎం పకీరియా, ఏ సామ్ రెడ్డి, కే మాధ వరెడ్డి, ఏ ప్రకాష్ రావు, జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

రెవెన్యూ మంత్రి అనగానికి అభినందనలు తెలుపుతున్న కేసన శంకర్రావు

రెవెన్యూ మంత్రి అనగానికి అభినందనలు తెలిపిన కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

మంత్రి పదవికే వన్నె తెచ్చేలా పేదలు- బడుగుల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి రెవెన్యూ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్య ప్రసాద్ అంకిత భావంతో కృషి చేయాలని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలియజేశారు. వెలగపూడి సచివాలయం నాలుగవ బ్లాకు లోని రూమ్ నెంబర్ 127 లో గురువారం ఉదయం 11:15 గంటలకు మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనగానికి వారు అభినందనలు తెలియజేశారు. అణగారిన వర్గాలకు చెందిన బీసీ నేతపై విశ్వాసం ఉంచి, కీలక మంత్రి పదవిని అప్పజెప్పిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతాభి వందనాలు తెలియజేశారు. పేదల పెన్నిధి, బడుగు వర్గాల ఆశాజ్యోతిగా సత్య ప్రసాద్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కేసన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి విన్నకోట వెంకటేశ్వరరావు (కన్నా మాస్టారు), తన్నీరు ఆంజనేయులు, శివరాం బాబాజీ, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, మల్లెల ఈశ్వర్, కోలా అశోక్, కొల్లు హనుమంతరావు తదితరులు పాల్గొని మంత్రి సత్యప్రసాద్ కు బొకేలను ఇచ్చి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పెదనందిపాడు

అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అంగన్వాడి ప్రత్తిపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు జి ప్రేమలత, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ డిమాండ్ చేశారు. గురువారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం సంఘం మండల అధ్యక్షురాలు పి శివ పార్వతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గత సంవత్సరం డిసెంబర్, ఈ సంవత్సరం జనవరి నెలలో 42 రోజులపాటు అంగన్వాడి లు న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని నిరవధిక సమ్మె నిర్వహించారని, ఆ సందర్భంగా ప్రభుత్వం కొన్ని జీవోలు ఇవ్వడం జరిగిందని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ లో ఉన్న జీవోలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఒప్పందంలో భాగంగా జులై నెలలో జీతాలు పెంపుదల చేస్తామని అప్పటి ప్రభుత్వం ఒప్పందం చేసిందని, ఆనాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా జీతాలు పెంపుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ మేరకు జీతాల పెంపుదల వెంటనే చేపట్టాలని, ఇతర సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా మన జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను, అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్ ఇచ్చి భర్తీ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్, హెల్పర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇంటి అద్దెలు, ఇతర బిల్లులు నెలల తరబడి బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయ కులు కె ధనలక్ష్మి, సిఐటియు మండల నాయ కులు దొప్పలపూడి రమేష్ బాబు, అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రేమలత, వేదికపైన నేతాజి తదితరులు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

టెక్నికల్ పర్సన్స్‌తో కమిషనర్ సమావేశం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలోని లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్స్ తో కమిషనర్ బి శేషన్న గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనధికార కట్టడాలకు సహకరించకూడదని చెప్పారు. మంగళగిరి డిటిసిపి ద్వారా ఆమోదం పొంది, తిక్లి బిల్డప్ ఏరియాలో కూడా ప్లాన్ పొందే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ 1,2 జడ్ సుధాకర్, ఎల్ సుబ్బారావు, లైసెన్స్ డ్ టెక్నికల్ పర్సన్స్ పాల్గొన్నారు.

చారిత్రక ప్రదేశాల సందర్శనకు ఎన్‌సిసి క్యాడెట్‌లు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీలో నిర్వహిస్తున్న ఎన్ సిసి ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమంలో బాగంగా ఎపి, తెలంగాణా మరియు రాజస్థాన్ ఎన్ సిసి డైరెక్టరేట్‌లకు చెందిన క్యాడెట్‌లు విజయవాడలోని అనేక ముఖ్యమైన సాంస్కృతిక మరియు చారిత్రక ప్రదేశాలను చూడడం కోసం గురువారం స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ శిక్షణా శిబిరం వద్ద నుండి బయలు దేరి వెళ్లారు. వారికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు కెఎల్ యు ఎన్ సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తెలిపారు. పలు రాష్ట్రాల నుండి కెఎల్ వర్శిటీలో శిక్షణకు వచ్చిన ఎన్ సిసి క్యాడెట్‌లకు విజయవాడలోని కనక దుర్గ దేవాలయం, సామాజిక న్యాయం విగ్రహం మరియు ఉండవల్లి గుహలను సందర్శించేందుకు వెళ్లారని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అత్యంత ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో ఒకటైన కనక దుర్గ ఆలయాన్ని సందర్శించడంతో పాటు సాంఘిక న్యాయం యొక్క విగ్రహాన్ని సందర్శించి అనంతరం భారతదేశం యొక్క గొప్ప నిర్మాణ మరియు సాంస్కృతిక చరిత్రకు నిదర్శనం అయిన పురాతన ఉండవల్లి గుహల సందర్శనతో పర్యటన ముగిస్తుందని అన్నారు. ఈ సందర్శన వలన వివిధ ప్రాంతాలకు చెందిన క్యాడెట్ల మధ్య ఐక్యత మరియు అవగాహనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌విఎస్ సుదర్శన్, కెఎల్ యు వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రొ విసిలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

కెఎల్ యు నుండి బయలుదేరుతున్న ఎన్ సిసి క్యాడెట్లు, అధికారులు

మంత్రి కి అభినందనలు తెలుపుతున్న సుందర్‌రావు

మంత్రి పార్ధసారధికి అభినందనలు తెలిపిన సుందర్రావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధ సారథిని గురువారం టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర రావు యాదవ్, టీడీపీ నాయకులతో కలిసి బొకే అందచేసి అభినందనలు తెలియజేసారు.ఈ సందర్భంగా సుందరరావు యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రిగా కొలుసు పార్ధసారథికి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.సియం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కి ప్రత్యక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శశి ధర్, డాక్టర్ శ్రీధర్,నియోజకవర్గ తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రెటరీ తాడి బోయిన భాస్కర్, జి.చంద్ పాల్గొన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు చైర్మన్ నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, మహిళలకు పంచి పెట్టారు. పెద్ద ఎత్తున హాజరైన మహిళలు నారా భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపుతూ సందడి చేశారు. పేద ప్రజలకు అండగా ఉంటూ తల్లి లాంటి ఆప్యాయతను చూపుతున్న నారా భువనేశ్వరి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మంగళగిరి పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, మంగళగిరి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, తాడేపల్లి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు బొర్రా కష్ణ వందన, నియోజకవర్గ, పట్టణ, మండల మహిళ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరిలో భువనేశ్వరి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టిడిపి మహిళలు

ప్రజాశక్తి - దుగ్గిరాల : ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రం దుగ్గిరాలలో ఘనంగా నిర్వహించారు. నారా లోకేష్ సహకారంతో స్థానిక రైలు పేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ గురువారం నాటికి 150 రోజులు పూర్తికావడంతో అన్న క్యాంటీన్ వద్ద కు వచ్చిన వారిచే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా రెండు ప్రత్యేక రోజులు కలిసి రావడంతో దాదాపు 250 మందికి స్వీటు హాటుతో ప్రత్యేక భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గద్దె శ్రీనివాస్ పర్వతనేని హర్ష నక్క చిరంజీవి ఎం రవి ఎన్ ప్రభాకర్ ఎం రాజేష్ కే గోపాల్ బాలు యాదవ్ లాలు నాయక్ బి లింగప్ప పాల్గొన్నారు.

దుగ్గిరాలలో

బాలకృష్ణను కలిసిన బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

బాలకృష్ణతో బ్రహ్మారెడ్డి, అప్పిరెడ్డి

సినీ నటుడు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు ఎన్నికల రోజున ఎన్నికల అనంతరం జరిగిన గొడవల గురించి బాలకృష్ణ ఆరా తీశారు. నియోజకవర్గ అభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించారు. మాచర్ల నియో జక వర్గం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు సహా య సహకారాలు అందిస్తానని బ్రహ్మారెడ్డికి తెలిపారు. బ్రహ్మా రెడ్డి వెంట సోదరుడి కుమారుడు జూలకంటి అప్పిరెడ్డి ఉన్నారు.

తిరునాళ్ల మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని దమ్మాలపాడులో శ్రీ వెంక టేశ్వర స్వామి ఆలయంలో సత్తెన పల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామంలో వెంక టేశ్వర స్వామి తిరునాళ్ళ మహెూత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ కార్య క్రమంలో ఆయన వెంట బత్తుల నాగేశ్వరరావు,శిరిగిరి వెంక ట్రావు,శిరిగిరి పవన్ కుమార్ ఉన్నారు.

'స్నేహహస్తాలు' ఆధ్వర్యంలో రూ.5 లక్షలతో బస్సు సెల్లార్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - అచ్చంపేట

స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ప్రభుత్వ వైద్యశాల దగ్గర సుమారు రూ.5,00,000 తో బస్సు సెల్లార్ నిర్మించడానికి గురువారం శంకుస్థాపన చేశారు స్నేహహస్తాలు ఫౌండేషన్ చైర్మన్ ఎంవి రావు భార్య మన్నెం రాజ్యలక్ష్మి ,మామిళ్ళపల్లి విజయలక్ష్మి చేతుల మీదుగా శంకు స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లా డుతూ అచ్చంపేట మెయిన్ రోడ్డు పక్కన బస్‌షెల్టర్ నిర్మించడం వలన హాస్పిటల్ కి వచ్చే రోగులకు , హై స్కూల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. కొత్తపల్లి నుండి చల్లగరిక వరకు వెళ్లే విద్యార్థులకు ఈసెల్లార్ ఉపయోగకరంగా ఉంటుందని, దూరం తగ్గు తుందని అన్నారు. స్నేహ హస్తాలు ఫౌండేషన్ గతంలో ఆర్‌కెజి పాలెం, క్రోసూరు మోడల్ స్కూల్ వద్ద రెండు బస్ షెల్టర్లు నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా స్నేహహస్తాలు ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో మండల విద్యా శాఖాధికారి ఆర్.నరసింహా రావు, తుమ్మ సౌరెడ్డి , మన్నెం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు టమోట అందేలా చర్యలు

- కూరగాయల ధరల పెరుగుదలపై జాయింట్ కలెక్టర్ సమీక్ష
- పుంగనూరు, మదనపల్లె నుండి టమోట కొనుగోలు చేయాలి
- టమోట, ఉల్లిపాయలు మొదలైన నిల్వలపై ఆకస్మిక తనిఖీలకు ఆదేశం

వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ప్రస్తుతం కూరగాయల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పల్నాడు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా మార్కెటింగ్, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా సరఫరాల, జిల్లా ఉద్యాన, సూక్ష్మ సాగునీటి సేద్యం అధికారి,రైతు బజారు ఎస్టేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. కూరగాయల ధరల నియంత్రణ కోసం తగు సూచనలు జారీ చేశారు. ప్రస్తుతం టమోట సాగు గణ నీయంగా తగ్గడంతో బహిరంగకూరగాయల మార్కెట్‌లో టమోటతో పాటు ఇతర కూరగాయల ధరలు అత్యధి కంగా పెరిగాయన్నారు.

పుంగనూరు, మదనపల్లె నుండి టమోట కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యాపారస్తుల వద్ద నిత్యావసర కూర గాయలైన టమోట, ఉల్లిపాయలు మొదలైన నిల్వలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ధరల స్థిరీకరణ జరిగే వరకు టమోట కొనుగోలు చేసి వినియోగదారులకు తక్కువ ధరకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కూరగాయల సాగు వైపు దృష్టి మరల్చాలి

కామినేని రామారావు,కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు

వాణిజ్య పంటలకు కేంద్రంగా మారిన పల్నాడు జిల్లాలో చిన్న,సన్న కారు రైతులతో గ్రామ సభలు ఏర్పాటు చేయాలని కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు అన్నారు. వ్యవసాయ ఉద్యాన శాఖలు అను సంధా నంగా వ్యవహరిస్తూ ధరలు స్థిరీకరణ చేసి రైతులకు ఆయా రకాల కూరగాయ విత్తనాలను, ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందజేసి ప్రోత్సహించాలన్నారు. తద్వారా రైతులకు, వ్యవసాయ కూలీలకు పనులు కల్పించడంతో పాటు వినియోగదారులకు అందుబాటు ధరల్లో కూరగాయలు సరఫరాకు అవకాశం ఉంటుందని, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇతర ప్రాంతాల నుండి కూరగాయలు కొనుగోలు చేసి రాయితీపై విని యోగదారులకు అందించాలన్న ఆలోచన మంచిదైనప్ప టికీ ఆచరణలో అనుకున్న స్థాయిలో వినియోగదారులకు న్యాయం జరిగే పరిస్థితి లేదన్నారు. రాబోయే రోజుల్లో నైనా ఈ ప్రాంత రైతుల సంక్షేమంతో పాటు వినియోగ దారులకు అందుబాటు ధరలలో అందాలంటే కూరగాయల సాగు వైపు రైతులను మరచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ఖాతాదారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కెఎస్ రాంప్రసాద్, హాజరైన ఖాతాదారులు, ప్రజలు

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలతో జాగ్రత్త

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజలంతా డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలని ఆన్ లైన్ మోసాలు,సైబర్ నేరా లపై జాగ్రత్తగా ఉం డాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కెఎస్ రాంప్రసాద్, ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్ కుమార్ అన్నారు. స్థానిక మెడి కల్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇం డియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌నకు ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షించారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ అనిల్ కుమార్, పల్నాడు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ పి.వెంకట స్వామి పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా బ్యాం కింగ్ ఫోల్డర్‌లో చేర్చాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని వినియోగ దారులకు, ప్రజలకు సూచిం చారు. రిసోర్స్ పర్సన్లు బి. నరసింహ నాయక్, ట్రైనీలు రవిరాజు, పృథ్వీరాజ్ ఖాతాదారులు తీసు కోవాల్సిన జాగ్రత్తలు, కొత్త ఖాతాలకు రాయాల్సిన విధానం, బ్యాంకింగ్ ఖాతా తెరవడం లావాదేవీలు నిర్వ హించడం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డిపా జిట్లు, డిపాజిట్ ఖాతాల గురించి, ఫిర్యాదుల పరి ష్కార వ్యవస్థ, భారతదేశంలో చెల్లింపులు, పరిష్కార వ్యవస్థ వయో వృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం, రిజర్వ్ బ్యాంకు ఇటీవల కల్పించిన సదుపాయాలు వివిధ అంశాలపై ఒక గంట పాటు శిక్షణ ఇచ్చారు.

జగనన్న కాలనీల పేరిట మాజీ మంత్రి అవినీతి

- విడదల రజినీపై పసుమర్రు రైతుల ఆరోపణ
- కాజేసిన తమ డబ్బులను తిరిగి ఇప్పించండి
- ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుకు రైతుల వినతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వ హయాంలో చేసిన అక్రమాలు, దోపిడీకి మాజీ మంత్రి విడదల రజిని మూల్యం చెల్లించక తప్పదని టిడిపి ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లా రావు అన్నారు. స్థానిక పండరీపురం నివాసంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరుతో ఆమె చేసిన దోపిడీ మొత్తాన్ని ఆధారాలతో సహా నిరూపించి శిక్షలు వేయించడం ఖాయమన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న కాల నీలు అతి పెద్ద కుంభకోణమని, భూమి కొనుగోలు, మౌలిక వసతుల పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పసుమర్రుకు చెందిన పలువురు రైతులు తనను కలసి రజని మంత్రిగా ఉన్న సమయంలో ఆమె చేసిన మోసా లపై తమ గోడు వెళ్లబోసుకున్నట్లు చెప్పారు. పసుమర్రుకు చెందిన రైతుల నుంచి 200 ఎకరాలు సేకరించి రూ.10 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. ముడుపులు చెల్లించిన తర్వాతనే ప్రభుత్వం నుంచి వచ్చిన డబ్బులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రజిని కాజేసిన తమ డబ్బులను తిరిగి ఇప్పించాలని రైతులకు తనకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

మాజీ మంత్రి రజినిపై ఫిర్యాదు చేస్తూ ఎమ్మెల్యే పుల్లారావుకు పత్రం అందజేస్తున్న రైతులు

కార్పొరేషన్‌లో అవినీతిపై ఆడిట్ విచారణ

- నిధుల దారిమళ్లింపుపై ప్రభుత్వం సీరియస్
- కమిషనర్ లేఖకు స్పందించిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మున్సిపాల్ కార్పొరేషన్ ఎకౌంట్స్ విభాగంలో గత ఏడాది వెలుగుచూసిన భారీ అవినీతి కుంభకోణంపై రాష్ట్ర అడిట్ విభాగం అధికారులు గురువారం విచారణ ప్రారంభించారు. రాష్ట్ర ఆడిట్ విభాగం జాయింట్ డైరక్టర్ కల్యాణి నేతృత్వంలోని నలుగురు అధికారులు గురువారం విజయవాడ నుంచి గుంటూరు చేరుకున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో కొన్ని ఫైళ్లు పరిశీలించారు. ప్రధానంగా కాంట్రాక్టర్లుకు నిధుల చెల్లింపుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ఒకరి పేరున బిల్లు మంజూరు చేసి సొమ్ములు మరొకరి పేరున చెక్కులు రాసిన వ్యవహారంలో గత ఏడాది ఎకౌంటెంట్ ఎస్.సిరిల్‌పాల్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని కమిషనర్ చేకూరి కీర్తి గతేడాది డిసెంబరులో ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆడిట్ విచారణ కోరారు.దీంతో ఆరు నెలలుగా విచారణ పెండింగ్‌లో ఉంది. ఎట్టకేలకు స్పందించిన ఆడిట్ విభాగం ఉన్నతాధికారులు ఒక బృందాన్ని గుంటూరు పంపారు. అప్పట్లో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన సొమ్ములో రూ.54 లక్షలు సిరిల్ పాల్ దారిమళ్లించారని కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు నిందితుడ్ని అరెస్టుచేశారు. తరువాత బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇప్పటికీ ఈ వ్యవహారంలో ఎంత సొమ్ము దారిమళ్లింది...ఎంత సొమ్ము ఎవరి ఖాతాలోకి వెళ్లింది విచారణ చేస్తున్నారు.

డిఎస్‌పి రామాజనేయులుపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గతంలో మంగళగిరి డిఎస్‌పిగా పనిచేసిన గోగినేని రామాంజ నేయులుపై వైసిపి ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఈమేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 నుంచి 2018 వరకు డీఎస్పీగా విధులు నిర్వహించిన గోగినేని రామాంజనేయులుపై 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సస్పెండ్ చేశారు. అప్పటి కొంతమంది వైసిపి నాయకులు ఫిర్యాదులపై సస్పెండ్ చేశారని విమర్శలు వచ్చాయి. రామాంజనేయులు హైకోర్టు ఆశ్రయించగా దానిని కొట్టివేసినట్లు తెలుస్తోంది. ఒక డీఎస్పీ స్థాయి ఉద్యోగిపై ఇంత కక్షపూరితంగా గత ప్రభుత్వం ఎందుకు వ్యవహరించిందో అర్థం కావటంలేదని పోలీస్ శాఖలో అంతర్గతంగా చర్చ నడిచినట్లు సమాచారం. ఒక ఉద్యోగిని ఆరు నెలలకు మించి సస్పెన్షన్‌లో ఉంచ కూడదనేది ప్రభుత్వ నిబంధన. అయినప్పటికీ డీఎస్పీ రామాంజనేయులును వైసిపి నాయకులు, అప్పటి మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదులపైనే వైసిపి ప్రభుత్వం ఎటువంటి విచారణ లేకుండా సస్పెండ్ చేసింది. ఇచ్చిన ఫిర్యాదుతో నాలుగున్నర ఏళ్లపాటు సస్పెన్షన్‌లోనే ఉంచారు. తాజాగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. దీంతో రామాంజ నేయులుపై ఉన్న సస్పెన్షన్ ను ఎత్తివేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే ప్రవేరిషన్‌తో కూడిన పోస్టింగ్ రామాంజనేయులును ఇవ్వనున్నట్టు తెలిసింది. తనపై కొంత మంది లేని పోని ఆరోపణలు చేస్తూ గత సర్కారు చాలా ఇబ్బందులు పెట్టిందని అన్నారు. అన్యాయంగా నాలుగున్నరేళ్ల పాటు సస్పెన్షన్‌లో ఉంచి ప్రజాసేవకు దూరం చేశారని రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తనపై ఉన్న సస్పెన్షన్ ను ఎత్తివేసినందుకు ప్రస్తుత సిఎం చంద్రబాబుకు, డిజిపికి కృతజ్ఞతలు తెలిపారు.

బాల కార్మిక వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

తెనాలి ర్యాలీలో చైల్డ్ రైట్స్ అడ్వొకసి ఫోరం బృందం

ప్రజాశక్తి తెనాలి

బాల కార్మిక వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ పెదకాకాని మండలం అనుమర్లపూడిలో గురువారం నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫోరం(క్రాఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యుపి స్కూల్ ఉపాధ్యాయిని జి. నిర్మల కుమారి పాల్గొని మాట్లాడుతూ బాలలు విద్యావంతులైతే మెరుగైన సమాజం ఏర్పడటానికి ఉపయోగపడతారన్నారు. పిల్లలను విద్యావంతులను చేయడంలో తల్లిదండ్రులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. బాలల హక్కుల చట్టాల పట్ల, రక్షణ యంత్రాంగాలపట్ల అవగాహన కల్పించాల న్నారు. క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి. వెంకట్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరు సహకరించాలన్నారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న బాలలతో పనులు చేయించటం, 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలలను ప్రమాదకరమైన సంస్థలలో, ప్రమాదకరమైన ప్రదేశాలలో నియమించటం నిషేధమన్నారు. ఎవరైనా బాల కార్మికు లను గుర్తిస్తే టోల్ ఫ్రీ చైల్డ్ హెల్ప్ లైన్- 1098కు గాని, 1800 102 7222 కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తక్షణ చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్. వెంకయ్య, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

శేకూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ - క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసం పురస్కరించుకొని బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా గ్రామంలో ప్రచారం నిర్వహించడం జరిగిందని క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి. వెంకయ్య తెలిపారు. గ్రామంలోని వీధులలో బాల కార్మిక వ్యతిరేక విధానాలను బ్యానర్ ప్రదర్శనతో మరియు మైక్ అనౌన్స్మెంట్ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాతంగి శ్యామల పాల్గొని మాట్లాడుతూ నేటి బాలలే నేటి పౌరులు అన్నారు. బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకం మాసం

చేబ్రోలులో ప్రచారం

కార్యక్రమంలో మనమందరము భాగస్వాములు కావాలని అన్నారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ బి ప్రశాంతి మాట్లా డుతూ బాలలను బాగా చదివించాలని అన్నారు. క్రాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ జి. వెంకయ్య మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని అంతం చేయడం అందరి బాధ్యతగా తీసు కోవాలని క్రాఫ్ట్ తరపున పిలుపునివ్వడం జరుగుతుందని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ వలన బాలలు శారీరకంగా, మానసికంగా మరియు లైంగికంగా ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్ చైల్డ్ హెల్ప్ లైన్- 1098 లేదా 1800 102 7222 కు ఫోన్ చేసి తెలియచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్స్ హేమలత, పద్మావతి, శివకోటేశ్వరమ్మ, చందు, విఆర్వో రాంబాబు, మహిళా సంరక్షణ కార్యదర్శి జె. ఫణి ప్రవళిక, సచివాలయం సిబ్బంది ఓంకారమ్మ, విజయ ప్రకాష్, రాణి, మరియు బాలల పంచాయతీ బాలలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వెన్నెముక రెవెన్యూ

ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్ కుమార్

ప్రజాశక్తి- గుంటూరు

ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ వెన్నెముక అని ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ అన్నారు. గురువారం రెవెన్యూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుంటూరులోని రెవెన్యూ భవన్ లో వేడుకలు నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథులుగా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘ నాయకులు కష్ణారావు, రిటైర్డ్ ఆర్డీవో ఇస్మాయిల్, రిటైర్డ్ తహసీల్దార్ ప్రసాద్, ఏపీ జేఏసీ అమరావతి గుంటూరు జిల్లా అధ్యక్షుడు సంగీతరావు, ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, బాపట్ల జిల్లా జేఏసీ కార్యదర్శి రజనీకాంత్, తహసీల్దార్ టీ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉద్యోగులకు ప్రత్యేకించి పని దినాలు లేవని, రేయింబవళ్లు ప్రజా సేవలో ఉంటారని తెలిపారు. మన హక్కులతోపాటు బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించి రెవెన్యూ శాఖకు ఇంకా మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెవెన్యూ శాఖ మాత సంస్థ అని చెప్పారు. ప్రజల జీవితాల కోసం పని చేసే శాఖ రెవెన్యూ అని పేర్కొన్నారు. మనిషి పుట్టుక నుంచి మరణం వరకు రెవెన్యూ విభాగంతో అనుబంధం ఉంటుందని, ఇది రెవెన్యూ ఉద్యోగికి అందిన గొప్ప వరమని చెప్పారు. రెవెన్యూ శాఖలో చట్టాలు, నియమాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలని, అలాంటప్పుడే ఉద్యోగంలో విజయం సాధించగలుగుతామని అన్నారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్

కేక్ కట్ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మాట్లాడుతూ రైతు కళ్లలో నీళ్లు పొంగినా, ప్రజల ఇళ్లలో కష్టాలు చుట్టుముట్టినా నేనున్నానంటూ ముందు నిలిచేది రెవెన్యూ ఉద్యోగి మాత్రమేనని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. 1786వ సంవత్సరంలో తొలిసారిగా రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి రెవెన్యూ సేవలు ప్రారంభమయ్యాయని తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్ కృషి ద్వారా ఈనాటికి రెవెన్యూ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించుకోగలిగామని చెప్పారు.తొలుత రెవెన్యూ అసోసియేషన్ వ్యవస్థాపకులు తోట సుధాకర్ ప్రసాద్ కు నివాళు లర్పించారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటరావు, రమాదేవి, విజయశ్రీ, స్వప్న, బాజి, ఈ డివిజనల్ మేనేజర్ వాసు, ఏపీ వీఆర్వోస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అయూబ్, ఇతర రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబు ప్రసాద్, ఏవిఎన్ కుమారి

కొల్లిపరలో అంగన్వాడీల సమావేశం

ప్రజాశక్తి- తెనాలి

అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కొల్లిపర మండల సమావేశం కె. జ్యోతి అధ్యక్షతన గురువారం జరిగింది. సిఐటియు జిల్లా నాయకులు కె బాబు ప్రసాద్ సమావేశంలో మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు, వారికి వర్తించే ప్రభుత్వ విధానాలు, పే కమిషన్, మినిమం వేజెస్ వంటి అంశాలను వివరించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పే కమిషన్ వేతనాలను సిఫారసు చేస్తుందని చెప్పారు. అలాగే వివిధ రకాల వేతనాల గురించి వివరించారు. అర్జున్ సేన్ గుప్తా నివేదిక ప్రకారం మినిమం వేజెస్, ఫెయిర్ వేజెస్, లివింగ్ వేజెస్ వంటివి ఉన్నాయని, అవి కాకుండా గౌరవ వేతనం ఉందని చెప్పారు. అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవియన్ కుమారి మాట్లాడుతూ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక సీఐటీయూ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, కె.చంద్ర శేఖర్, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

ర్యాలీలో ఎంఈఓ జయంతి బాబు

తెనాలిలో కొనసాగుతున్న 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - తెనాలి

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, చదువు మానేసిన 14 ఏళ్లలోపు చిన్నారులను కూడా బడికి పంపించాలని కోరుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమం పట్టణంలో గురువారం కూడా కొనసాగింది. స్థానిక మున్షి మస్తాన్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిఆర్ఎంటి శ్రీదేవి కలిసి ఇస్లాంపేట హిందూ ముస్లిం రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆ ప్రాంతంలో మహిళలు, పురుషులతో ఎంఇఒ మాట్లాడారు. పిల్లలను బడికి పంపాలని, అది తల్లిదండ్రుల బాధ్యతగా చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఓతో పాటు సిఆర్ఎంటి, విద్యార్థులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న జంగాల అజయ్‌కుమార్ తదితరులు

అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి- తాడికొండ

తాడికొండ గ్రామ పంచాయతీలో కార్మికునిగా పని చేస్తున్న రెడ్డి వెంకటేశ్వర్లు (65) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. 20 సంవత్సరాలుగా పంచాయతీ కార్మి కునిగా తన బాధ్యతలు నిర్వహించాడు. బక్రీద్ రోజున పని చేస్తూ అస్వస్థకు గురయ్యాడు. మృతునికి ముగ్గురు కుమా రులు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ అరుణకుమార్ , మేడా హనుమంతరావు ముప్పాళ్ళ శివ శంకర్ రావు, సిపిఎం మండల కార్య దర్శి చింతల భాస్కరరావు వెంకటేశ్వర్లు మృతదేహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఎఎన్‌యు ఐ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెల్ఫ్ సపోర్టు కేటగిరిలో నిర్వహిస్తున్న ఏఎన్యూ ఐసెట్ 2024కు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించినట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు జూలై రెండవ తేదీలోగా రూ.వెయ్యి అపరాధ రుసుము చెల్లించి ఆఫ్ లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అర్హత పరీక్ష జూలై మూడవ తేదీన నిర్వహిస్తామని వివరించారు. ఈ అర్హత పరీక్ష ద్వారా ఎంబీఏ కేటగిరిలో 8 కోర్సులను అందించనున్నట్లు డాక్టర్ అనిత తెలిపారు.

పీజీ సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తున్న ఏఎన్యూ పీజీ సెట్ 2024 కు సంబంధించి దరఖాస్తు గడుగు జూలై 18వ తేదీ వరకు పొడిగించినట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి .అనిత తెలిపారు. సెల్ఫ్ సపోర్టు కేటగిరి విధానంలో ఈ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పీజీ కోర్సుల్లో ఎంఏ, ఎం ఎస్ సి, ఎం కామ్, ఎం పి ఏ, ఎంపీఈ డీ, ఎంఈడి, ఎమ్ ఎల్ ఐ ఎస్ సి కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్ సైట్ www.anu.ac.inను సంప్రదించాలని డాక్టర్ అనిత సూచించారు.

నేడు వర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్ కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విశ్వవిద్యాలయంలోని క్రీడా ప్రాంగణంలో యోగా పై అవగాహన కల్పించే ప్రదర్శనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో యోగా విద్యావిభాగం, వ్యాయామ కళాశాల, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లు పాల్గొంటారని పాల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కిట్స్ అందచేస్తున్న ఎమ్మెల్యే నసీర్, డిఇఒ శైలజ తదితరులు

విద్యార్థులు సమగ్రంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉర్దూ హైస్కూల్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చేతుల మీదుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, ఆట స్థలాలు, మధ్యాహ్న భోజనం, అనేక సౌకర్యాలు ఉన్నాయని, వాటన్నిటినీ వినియోగించుకోవాలని కోరారు. తమ ప్రభుత్వం రాగానే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పాఠశాలలు మొదలైన వారం రోజుల్లోనే పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యాపరమైన పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు, ఆటల్లోనూ ముందు ఉండాలని, సమగ్రంగా అభివృద్ధి చెందాలన్నారు. తమ ప్రభుత్వంలో కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు ఉంటే వారందరికీ అమ్మఒడి ఇవ్వనున్నట్లు చెప్పారు.జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గతేడాది 10,120 కిట్స్ అందించగా, ఈ సంవత్సరం 12,390 కిట్స్ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు వెంకటేశ్వరరావు, నాగేంద్రమ్మ, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి యండి.ఖాసిం, టిడిపి నాయకులు గౌస్, కార్పొరేటర్ చిష్టీ, హెచ్ఎంలు విజయలక్ష్మి, రమణయ్య, జిలానీ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులకు ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

స్థానిక గుంటూరు మెడికల్ కాలేజీలో ఎస్‌పియం గ్యాలరీలో, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య కార్యకర్తలకు ఏర్పాటు చేసిన రెండో విడత 3 రోజుల 'సబ్ డిస్టిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' గురువారం ముగిసింది.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందినవారు శిక్షణలో తెలుసుకున్న విషయాలను ఆగస్టు మాసంలో జరగబోయే ఇంటింటి సర్వేలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించిన ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకుని వెళ్లి, గహసందర్శనలో ప్రశ్నలు అడిగి, వారి సమాధానాలకు అనుగుణంగా, అనుమానాస్పద క్యాన్సర్ కేసులను గుర్తించాల్సి ఉంటుందన్నారు.ఆ విధంగా గుర్తించిన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయటం, అక్కడ వైద్యాధికారి వారిని పరీక్షించి, అవసరాన్ని బట్టి అనుమానాస్పద కేసులను, తతీయ శ్రేణి ఆసుపత్రికి రిఫర్ చేస్తారని, అక్కడ క్యాన్సర్‌గా నిర్ధారణ అయిన కేసులకు చికిత్స చేసి తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎన్‌సిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్.ఏ.శ్రావణ్‌బాబు, శిక్షకులు డాక్టర్.వరప్రసాద్, డాక్టర్. హేమంత్, డాక్టర్ తేజ, డెంటిస్ట్, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్.అనూష, శ్రీ. గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్

ప్రకటించిన బెంగళూరులోని న్యాక్ కౌన్సిల్

గ్రేడ్ సాధనకు కృషి చేసిన అందరికీ అభినందనలు : విసి ప్రొఫెసర్ పి.రాజశేఖర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

హర్షం వ్యక్తం చేస్తున్న విసి తదితరులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దేశంలోనే న్యాక్ అక్రిడేషన్ డ్యూయల్ మోడ్లో వెళ్లిన తొలి విశ్వవిద్యాలయంగా నిలిచింది. న్యాక్ కౌన్సిల్ ఏ ప్లస్ గ్రేడ్ ను 3.46 సీజీపీఏ తో కేటాయించడం జరిగింది. ఈ మేరకు గురువారం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ విశ్వవిద్యాలయంలోని అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులతో ప్రత్యేక అభినందన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి 26వ వరకు విశ్వవిద్యాలయం న్యాక్ 4వ సైకిల్‌కు వెళ్లిందని మూడు రోజులు కమిటీ పర్యటన అనంతరం న్యాక్ గ్రేడును కౌన్సిల్ కు సమర్పించినట్లు పేర్కొన్నారు. న్యాక్ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం కౌన్సిల్ యూనివర్సిటీకి ఏ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించిందని వివరించారు. వర్శిటీ 3.08 సిజిపిఏతో ఏగ్రేడ్‌లో కొనసాగుతుందని ప్రస్తుతం జరిగిన 4వ సైకిల్ లో 3.46 సిజిపిఎస్ సాధించి ఎ ప్లస్ గ్రేడ్ పొందినట్లు వీసి పేర్కొన్నారు. కేవలం 0.05 పాయింట్ల తేడాతో ఏ డబుల్ ప్లస్ మిస్ అయిందని వివరించారు. ర్యాంకు సాధనకు కృషి చేసిన అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, సెక్యూరిటీ గార్డు స్థాయి నుంచి రెక్టర్ స్థాయి వరకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. గడిచిన ఏడాదిన్నర కాలంగా విశ్వవిద్యాలయం న్యాక్ కోసం పడుతున్న కృషికి ఫలితం దక్కిందని అన్నారు. రీసైకిల్ ద్వారా ర్యాంకు పొందిన తొలి విశ్వవిద్యాలయంగా ఏఎన్యూ నిలిచిందని వీసి ప్రకటించారు. దీనిద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధి విస్తృతంగా సాగుతుందని పేర్కొన్నారు. దూరవిద్య కేంద్రం ఇప్పటివరకు కేవలం ఆర్ట్స్ కోర్సులు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తూ ఉందని న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడంతో సైన్స్ కోర్సులు కూడా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని, ఆన్లైన్ కోర్సులను కూడా నిర్వహించుకునే వీలును న్యాక్ ర్యాంకు ద్వారా వచ్చినట్లు పేర్కొన్నారు. ర్యాంకు సాధనలో నిరంతరం కషిచేసిన న్యాక్ వర్సిటీ కమిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణలను ప్రత్యేకంగా అభినందించారు. అయితే న్యాక్ ఏ ప్లస్ ప్రకటన అనంతరం ఏ డబల్ ప్లస్ కు పరిశీలన చేయాలని విశ్వవిద్యాలయం చేసుకున్న విన్నపాన్ని పరిగణలోకి తీసుకోలేదని వీసీ వివరించారు. అలాగే వర్సిటీలో న్యాక్ బృందం పరిశీలించిన అంశాలను వివరించారు. బలాలు బలహీనతలను నివేదిక రూపంలో అందించినట్లు పేర్కొన్నారు. 48 ఏళ్ల విశ్వవిద్యాలయం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న తీరును ప్రశంసించిందని పేర్కొన్నారు. గ్రీన్ యూనివర్సిటీగా, ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా, సేంద్రీయ ఆహార ఉత్పత్తులు విశ్వవిద్యాల విద్యార్థులకు అందిస్తున్న విశ్వవిద్యాలయంగా, ఉత్తమ పాలన అధ్యాపకుల్లోనూ ఉద్యోగుల్లోనూ కల్పిస్తూ విశ్వవిద్యాలయాన్ని ముందుకు నడిపిస్తున్న అధికారులపై ప్రశంసలు కురిపించారని పేర్కొన్నారు. అలాగే విద్యావిషయక అంశాలపై మరింత లోతైన దృష్టి సారించాలని, అధ్యాపకుల కొరతను భర్తీ చేయాలని, పరిశ్రమలతో అనుసంధానం కావాలని, ఎంటర్ప్రెన్యూర్ షిప్‌ను బలోపేతం చేసుకోవాలని సూచించినట్లు వీసీ పేర్కొన్నారు. ప్లేస్మెంట్ సెల్, కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ లను విస్తృత పరచాలని, ఫండింగ్ ఏజెన్సీ లను ఆకర్షించాలని, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను ఇవ్వాలని, లైబ్రరీని సెంట్రలైజ్డ్ లైబ్రరీగా మార్చాలని సూచించినట్లు వీసి పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్టర్ ప్రొఫెసర్ బి. కరుణ, న్యాక్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోలే, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ , వర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ స్వరూప రాణి, ప్రొఫెసర్ గంగాధర్ రావు, ప్రొఫెసర్ సిద్దయ్య, ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ ప్రమీల రాణి, ఓఎస్‌డి ప్రొఫెసర్ సునీత, సిడిసిడిన్ ప్రొఫెసర్ కే. మధుబాబు, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్. ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజక కమ్యూనిటీ హాలు పూర్తికి లోకేష్ హామీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంత్రి లోకేష్‌నకు సమస్యను వివరిస్తున్న వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు

తాడేపల్లి 17వ వార్డు ధోబికానా స్థలంలో నిర్మాణంలో ఉన్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసేలా మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ హామీ ఇవ్వడం పట్ల ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో గత నాలుగు సంవత్సరాల నుంచి నత్తనడకన సాగుతున్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి రజక కళ్యాణమండపం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలనా ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, ఇస్త్రీదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాగోలు శ్రీనివాస్, తాడేపల్లి నగర అధ్యక్షులు మొరతోటి సుబ్బారావు, వల్లభాపురం మస్తానరావు, కొత్తపల్లి శ్యామ్, ప్రాతూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కృష్ణవేణితోనే సాధ్యం

కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి పల్నాడు జిల్లా

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని తదితరులు

విద్యార్థుల కలలను, తల్లిదండ్రుల ఆకాంక్షలను సాకారం చేస్తూ నాణ్యమైన విద్యా ప్రమాణాలతో ముందుకు వెళుతున్న నేపథ్యంలోనే బుధవారం విడుదల చేసిన డిగ్రీ 3వ ఏడాది 5వ సెమిస్టర్ ఫలితాలలో కృష్ణవేణి విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి మార్కులు సాధించి పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. తమ విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించగా బీకాం కంప్యూటర్‌లో వై అనూష 700 మార్కులు గాను 630, ఎన్ బాల అజయ్ కుమార్ 627, ఎల్ రాకేష్ నాయక్ 611 మార్కులు సాధించారన్నారు. తమ విద్యాసంస్థలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణానికి సమీపంలో ఆహ్లాదకర వాతావరణంలో నెలకొల్పిన భవనంలో విద్యను బోధించడంతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి కృష్ణవేణి విద్యాసంస్థలు నిర్విరామంగా కృషి చేస్తున్నాయని, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ విద్యార్థులకు సమాజంలో గుర్తింపునిస్తూ ఉద్యోగాలలో స్థిరపడే విధంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండేలా ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు, సైన్స్ ఫెయిర్ సంస్కృతి సాంప్రదాయాలపై కల్చరల్ కార్యక్రమాలు చేపడుతున్నామని క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుటకు కృషి చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ స్థాయి మార్కులు సాధిస్తూ 100శాతం ఉత్తీర్ణతతో తమ విద్యార్థులు నిలుస్తున్నారని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కళాశాల ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, అకడమిక్ డైరెక్టర్ డి యోగేశ్వరరావు, ఎం ఆర్ కె సతీష్ బాబు, ఎస్ డి సర్దార్ జానీ హుస్సేన్, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్.కె మున్నీసా, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.